www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 20 ఏప్రిల్ 2025

5

వైఎస్‌ఆర్



వడదెబ్బతో 'ఉపాధి' కూలీ మృతి



బోరెడ్డి ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఎండల భరించక వడదెబ్బతో ఉపాధి కూలీ పనిచేసే ప్రాంతంలోనే మృతి చెందారు. శనివారం మండలంలోని గురజాలలో ఉపాధి పనులకు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి (50) వెళ్లారు. పని చేస్తున్న క్రమంలో ఎండల అధికం కావడంతో వడదెబ్బ కొట్టి స్పృహతప్పి పడిపోయారు. గమనించిన తోటి కూలీలు ఆయన్ను లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందారు. మృతునికి భార్య ఈశ్వరమ్మతో పాటు కుమారులు ఉన్నారు. మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఎపిఒ జయ భారతి, ఈసి శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మృతుని కుటుంబానికి ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

దోసపై ఆశలు ఆవిరి



- అమాంతం పడిపోయిన ధర
- కిలో రూ. 14 చేరిన వైనం
- నష్టాలబాటలో రైతులు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

ఎన్నో ఆశలు పెట్టుకుని సాగు చేసిన దోస పంటకు ధరలేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెలరోజుల క్రితం కిలో రూ.14 ఉన్నది. రూ. 20 ఉన్న ధర, ఒకే సారి రూ.6 తగ్గడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పులివెందుల నియోజకవర్గంలో రైతులు దోస పంటను 840 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది ఈ పంటపై లాభాలు గడించడంతో ఈ ఏడాది పంట విస్తీర్ణం మరింత పెంచారు. ధరలు తగ్గిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎకరా దోస సాగుకు కూలీలు, దున్నకాలు, మల్చింగ్, ఎరువులు, మందులు తదితరాలకు రూ. 90వేల నుంచి రూ.లక్ష వరకు అవుతోందని రైతులు చెబుతున్నారు. దీంతో పాటు ఎకరాకు 250 గ్రాముల విత్తనాలు అవసరం. మార్కెట్లో కిలో విత్తనాలు రూ.55వేలు పలుకుతోంది. డ్రిప్ వైరు 4 కట్టలు అవసరముండగా కట్ట రూ.1500 పలుకుతోంది. పంట దిగుబడుల ప్రారంభదశలో రూ.20 వేలు పలికిన టన్ను పంట ధర ఉన్న పళంగా రూ.6 వేలకు పడి పోయింది. కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో కొంతమంది రైతులు కాపుకొచ్చిన కాయలను పొలంలోనే వదిలేశారు. మరి కొంత మంది వాహనాల్లో వేసుకుని సంతల్లో, పట్టణాల్లో తిరిగి అమ్ముకుంటున్నారు. కొంత ఆలస్యంగా పంట సాగు చేసిన రైతులు తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇక్కడి పంట తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, హైదరాబాద్ ప్రాంత వ్యాపారులు కొనేవారు. ప్రస్తుతం ఆ రాష్ట్రాల్లో కూడా పంట సాగవుతుండడంతో వ్యాపారులు ఇక్కడికి రావడం లేదు. దీనికి తోడు పంట విస్తీర్ణం కూడా పెరగడంతో ధరలు పడిపోయినట్లు రైతులు చెబుతున్నారు.

ఓ అన్నా..! నా దోస పంట చేతికొచ్చింది. ఎలాగైనా కొనుకెళ్లు. నీకు ఎంతతోస్తే అంత డబ్బులు ఇవ్వు. మొదట ఈ కాయలన్నీ తీసుకెళ్లు అంటూ దోస సాగు చేసిన రైతులు వ్యాపారులను వేడుకుంటున్న వైనం ఆవేదన కలిగిస్తోంది. ఢిల్లీ రకం దోస ధర పూర్తిగా పతనం కావడమే ఇందుకు కారణం. గతేడాది టన్ను దోస రూ.20 వేలకు పైగా ధర పలకగా ప్రస్తుతం మూడు వేల రూపాయలు ఇచ్చి కొనుక్కెళ్లండి అని చెప్పినా ముందుకు రాని దుస్థితి.



ఆటోలో దోసకాయలు అమ్ముతున్న రైతు

దిగుబడి బాగా వచ్చినా ధర లేదు

పంట దిగుబడి బాగా వచ్చింది. రంజాన్ మాసం తర్వాత డిమాండ్ పెరిగి మంచి లాభాలు వస్తాయని ఆశించాం. అయితే మా అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ధరలు లేక నష్టాలే మిగిలాయి.

- చెన్న కృష్ణారెడ్డి, రైతు, లింగాల మండలం

నాలుగు ఎకరాలలో సాగు చేశా

నాకున్న నాలుగు ఎకరాల్లో దోస సాగు చేశా. ఎకరానికి రూ.లక్ష వరకు ఖర్చయింది. ప్రస్తుతమైతే ధరలేదు. ఆలస్యంగా సాగు చేశాను దిగుబడులు వచ్చే సమయం దగ్గర పడుతోంది. అప్పటికి మంచి ధరలు వస్తాయని ఆశిస్తున్నా.

- పుల్లయ్య, రైతు, పులివెందుల

ఈదురుగాలు.. వడగండ్ల వర్షానికి

నేలకొరిగిన అరటి

- సింహాద్రిపురంలో రూ.30 లక్షల మేర నష్టం
- నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం
- తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి



దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వేముల/ సింహాద్రిపురం

పులివెందుల నియోజకర్గరంలోని వేముల, సింహాద్రిపురం మండలాల్లో శుక్రారం రాత్రి వీచిన ఈదురగాలులకు అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా వేముల మండలంలోని స్థానిక వేముల, మీదిపెంట్ల, వేల్పుల గ్రామాల్లో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వడగండ్ల వర్షానికి పలు గ్రామాల్లో అరటి పంటలు నేలకొరిగాయి. మీదిపెంట్ల, వేముల, వేల్పుల తదితర గ్రామాల్లో అరటి చెట్లు నెలకూలాయి. వేముల మండలంలో దాదాపు 535 ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మరో వారం రోజుల్లో చేతికి వచ్చే పంట ఇలా ఈదురు గాలులకు నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అరటికి ఎకరాకు రూ.1.50 లక్షలు వరకు పెట్టుబడులు పెట్టామని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రకృతి వైపరీత్యం పూర్తిగా నష్టాన్ని తెచ్చిపెట్టిందని ఆందోళన చెందుతున్నారు. ఐదు ఎకరాల్లో సాగు చేసిన అరటి పంట మొత్తం శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు నేలమట్టం అయిదన్నారు. దాదాపు రూ.7 లక్షలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పేర్ల పార్థసారథి రెడ్డి,పేర్ల శేషారెడ్డి, ఎఒ చెన్నారెడ్డి ఈదురు గాలులుకు దెబ్బతిన్న అరటి తోటలను శనివారం పరిశీలించారు. అరటికి వాటిల్లిన నష్టాన్ని సిఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని చెప్పారు. హెక్టార్‌కు రూ. 35 వేలు, మొక్కలు నాటు కోవడానికి కూడా పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా అరటి తోటలు నష్టపోయిన రైతుల పేర్లు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని అధికారులను కోరారు. వారి వెంట ఉద్యానవనశాఖాధికారి రాఘవేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో.. మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి వీచిన భారీ గాలులకు అరటి తోటలు నేలకు వాలాయి. మండలంలోని బిధునంచర్ల, అంకాలమ్మ గూడూరు, గురజాల, కోరగుంటపల్లె, కసునూరు తదితర గ్రామాలలో గాలుల కారణంగా కోతకు వచ్చిన అరటి చెట్లు నేలకు వాలాయి. బిధునం చర్ల గ్రామంలో వెంకట లక్ష్మమ్మ, ఆదినారాయణ రెడ్డి ,నవీన్ కుమార్ రెడ్డితో పాటు మరి కొంతమంది రైతుల తోటలు గాలులకు కిందపడ్డాయి. ఈ తోటలను ముద్దనూరు ఉద్యానవన శాఖ అధికారి మల్లేశ్వర్ రెడ్డి పరిశీలించారు. మండల వ్యాప్తంగా 25 ఎకరాలలో దాదాపు రూ. 30 లక్షల మేర నష్టం వాటిలినట్లు తెలిపారు. బాధిత రైతుల నుంచి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.



ఈదురగాలులకు నేలకొరిగిన అరటి

జెఇఇ మెయిన్స్‌లో విద్యార్థుల సత్తా



విద్యార్థులతో నారాయణ కళాశాల యాజమాన్యం



విజయ చిహ్నం చూపుతున్న శ్రీచైతన్య విద్యార్థులు



కరస్పాండెంట్‌తో బీరం కళాశాల విద్యార్థులు

నారాయణ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కడప అర్బన్ : నగరంలోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు జెఇఇ మెయిన్స్ -2025 ఫలితాలలో ప్రతిభ కనబరిచారు. అల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో అబ్దుల్ హసీమ్ 1417,రామ్ శరన్ -2082, జగత్ స్మరన్ రెడ్డి -2336, ఆదిత్య వర్ధన్ రెడ్డి -2550, ధనుష్ -3523, సుధీర్ రెడ్డి -8179, ధీరజ్‌రెడ్డి -8179 ,శ్రీలేఖ -11049, సుజన -14426, నితిన్ రెడ్డి -17071, ఉమర్ -18435, దీపక్-24658, మొహ్మద్ అజాన్-25763 ర్యాంక్స్ సాధించారు. 200 మందికి పైగా విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. ఈ విజయం సాధించిన విద్యార్థులను డిజిఎం రాంమోహన్ రెడ్డి, డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, సుబ్బారావు, ఎజిఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపల్ మురళి మోహన్, వెంకటస్వామి, సుధాకరెడ్డి, సౌజన్య ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీచైతన్య కళాశాల విద్యార్థుల ప్రభంజనం : ఎన్‌టిఎ ప్రకటించిన జెఇఇ మెయిన్స్ ఫలితాలలో కడప శ్రీ చైతన్య కళాశాలలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అద్భుత ఫలితాలు సాధించారు. ఆల్ ఇండియా అన్ని క్యాటగిరీలలో టీ గౌతమ్ 321 వ ర్యాంకు, ఇ. జస్వంతి 458వ ర్యాంకు, ఎం.గురు సూర్య 818వ ర్యాంకు, బి.అన్విత్ 1214వ ర్యాంకు, కె.సతీష్ 1968వ ర్యాంకు, కె.శివరాం నాయక్ 6094 వంటి ర్యాంకులతో పాటు 52 మంది విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్ పరీక్ష రాయడానికి అర్హత సాధించి కళాశాల కీర్తి ప్రతిష్టలు అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారని కళాశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. పోటీ పరీక్షలలో టాప్ ర్యాంకుల సాధన ధ్యేయంగా కృషి చేస్తూ ఆలిండియా పరీక్షల సాధనలో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించడం శ్రీ చైతన్య విద్యా సంస్థ విశిష్ట ప్రణాళిక, ఉత్తమ మెటీరియల్స్, అధ్యాపకుల నిరంతర కృషి ప్రోత్సాహం అని శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు సుష్మ శ్రీ, నాగేంద్ర కుమారు తెలిపారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని శ్రీ చైతన్య తిరుపతి డివిజన్ ఎజిఎం బివి ప్రసాద్, డీన్ కె.ఎల్ జి ప్రసాద్, విజయ భాస్కర్ రెడ్డి, ప్రవీణ్, నాగరాజు, అడ్మిన్ ఆఫీసర్ మనోజ్, మల్లికార్జున స్వామి, నాగిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శివప్రసాద్ అభినందించారు.

'బీరం' విద్యార్థుల హవా

ఖాజీపేట : జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టిఎ) విడుదల చేసిన జెఇఇ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో బీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం వెలువడిన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో కనిష్క 99.79, దుష్యంత్ 99.75, శ్రీరామ్ 99.39, మేఘశ్యామ్ 99.37, రామ్ కిషోర్ 98.83, కుర్రా దీప్తి 98.67, యోగానంద రెడ్డి 98.19, హర్షవర్ధన్ 97.81, జ్యోత్స్న 97.68, తన్వితా రెడ్డి 96.87, వైష్ణవి 96.78, అనిల్ కుమార్ రెడ్డి 96.39, చాపాటి శశాంక్ 95.31, సృజిత్ 95.02, వెంకట దీపిక 95.01 శాతం సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, కళాశాల చైర్ పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనలో ఆదర్శంగా నిలు స్తుండడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బీరం పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్తీక్‌రెడ్డి

జెఇఇ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో ఖాజీపేట టీచర్స్ కాలనీకి చెందిన శ్రీసాయి కోచింగ్ సెంటర్ పూర్వ విద్యార్థి మలికిరెడ్డి కార్తీక్‌రెడ్డి 99.88 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచాడు. ఆ మేరకు శ్రీసాయి స్కూల్ కోచింగ్ సెంటర్ యాజమాన్య ప్రతినిధి పత్తి వెంకట విజయ భాస్కర్‌రెడ్డి శనివారం తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన మలికిరెడ్డి హనుమంతురెడ్డి, అనురాధ దంపతుల కుమారుడు కార్తీక్‌రెడ్డి టాపర్‌గా నిలవడంతో కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మలబార్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మహిళలు

మలబార్ గోల్డ్ డైమండ్స్, అక్షయ తృతీయ ఆఫర్లు ప్రకటించిందని షోరూం హెడ్ లెసన్ సత్యన్ తెలిపారు. అక్షయ తృతీయ వేడుకల్లో భాగంగా బంగారు ఆభరణాల తరుగు ఛార్జీలపై 25శాతం వరకు తగ్గింపు, ప్రీషియస్ స్టోన్స్ అండ్ అన్ కట్ డైమండ్స్ ఆభరణాల తరుగు ఛార్జీలపై ఫ్లాట్ 25 శాతం తగ్గింపు, వజ్రాల విలువపై 25శాతం వరకు తగ్గింపు అంది స్తోందని తెలిపారు. అడ్వాన్స్ బుకింగ్‌లతో ఉచితంగా వెండి నాణెం ఇస్తామన్నారు. వినియోగదారులు తాము కొనుగోలు చేయాలనుకునే ఆభరణాల మొత్తం విలువలో కనీసం 10శాతం చెల్లించి తమ ఆభర ణాలను బుక్ చేసుకోవచ్చుని పేర్కొన్నారు. బుక్ చేసిన రోజు మార్కెట్ ధర లేదా ఆభరణాలు తీసుకునే రోజు మార్కెట్ ధర, ఈ రెండింటిలో ఏది తక్కువైతే దానినే తుది ధరగా నిర్ణయిస్తారని చెప్పారు.

ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి


ప్రజాశక్తి - కడప : గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ కేడర్ కల్పించి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.జాని పాషా విజ్ఞప్తి చేశారు. శనివారం కడప నగరంలోని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు హీరామియా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . గ్రాడ్యుయేషన్ విద్యార్హతతో ఉద్యోగాలు సాధించిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటి వరకు రికార్డ్ అసిస్టెంట్ కేడర్ అంతకంటే తక్కువ కేడర్‌తో పేస్కేల్ అమలు అవుతుందని పేర్కొరన్నారు. ప్రభుత్వం సహృదయంతో స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేందుకు కృషి

ప్రజాశక్తి - కడప : మే 10న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని పోలీసు అధికారులకు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 10న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్‌ల వారిగా కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజంపేట అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ రామ్నాథ్ హెగ్డే, కడప అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ప్రకాష్ బాబు, కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వెంకటేశ్వర్లు, మైదుకూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రాజేంద్రప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు , సబ్ ఇన్‌స్పెక్టర్లు , కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కడప నగరంలో రన్‌ఫర్ జీసస్

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న పాస్టర్ విక్టర్ రాజు

కడప నగరంలో సిఎస్ఐ సెంట్రల్ చర్చ్ ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని సిఎస్ఐ సెంట్రల్ చర్చ్ పాస్టర్ విక్టర్ రాజు ప్రారంభించారు. చర్చి వద్ద నుంచి ప్రారంభమై నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగి తిరిగి వరకు సాగింది. ఈ సందర్భంగా పాస్టర్ విక్టర్ రాజు మాట్లాడుతూ ఏసు పుట్టుక, మరణం, తిరిగి లేచిన సందర్భంగా ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చర్చి సెక్రటరీ మనోహర్ బాబు, ట్రెజరర్ డానియల్, స్త్రీల మైత్రి ప్రెసిడెంట్ స్వరూప రాజన్న, కార్యదర్శి శ్రీదేవి మునిరాజు, జాయింట్ సెక్రటరీ జంబారపు రాజామణి రాజు, చర్చి సభ్యులు, సంఘవిశ్వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం

ప్రజాశక్తి-కాశినాయన : విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించి వారి భవిష్యత్తుకు నాంది పలకాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు మండలం, పరిధిలోని గంగనపల్లి, మిద్దెల దళితవాడ, ఆర్‌సిఎం కొండరాజుపల్లె గ్రామాల్లో శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం అనే కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులతో ఒకటి నుండి ఐదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లను చేర్చాలని అవగాహన కల్పించారు. వారికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కన్న జోజయ్య, జిల్లా కమిటీ సభ్యులు కుర్ర చిన్న కృష్ణయ్య మాట్లాడుతూ విద్యారంగం సంక్షోభంలో ఉందని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కచ్చితంగా గ్రామాల్లోని ప్రజలతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుల బుసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గురప్ప, ఇతర ముఖ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి పెద్ద తప్పు చేసింది : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : బిజెపి తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చి టిడిపి పెద్ద తప్పు చేసిందని కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షులు హమీద్ అన్నారు. కచ్చితంగా కూటమి ప్రభుత్వానికి రాబోవు కాలంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. శనివారం కాంగ్రెస్ సిటీ ప్రెసిడెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమీద్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వైసిపి లాగా బి 2 పార్టీ కాదు అన్నారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ప్రస్తుతం ఉన్న వైసిపి కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లుగా మారుతారన్న భయంతో ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. రాబోవు కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ప్రజలు బాగా బుద్ధి చెబుతారు అన్నారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ కడప కార్పొరేషన్ ఎన్నికలలో విజయకేతనం ఎగురవేస్తుందని అన్నారు. బిజెపి ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తీసుకొస్తే ఆ బిల్లులకు కూటమి, వైసిపి మద్దతు ఇచ్చాయని చెప్పారు. విలేకరుల సమావేశంలో 40, 43, 36, 29, 7వ డివిజన్ల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

కువైట్‌లో 'ఆకేపాటి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కడప



వేడుకలను నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

కువైట్ ఒమేరియా పార్క్‌లో రాజంపేట శాసన సభ్యులు ఆకేపాటి అమర్ నాథ్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఆ పార్టీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మీ ప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వంద మందికి పైగా భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి గల్ఫ్ వైసిపి కో కన్వీనర్ గోవిందు నాగరాజు, రెడ్డి సంఘం కువైట్ అధ్యక్షులు, వైసిపి గల్ఫ్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు నాయిని మహేశ్వర్ రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ షేక్ రెహ్మతుల్లా, వైసిపి కో- కన్వీ నర్ మర్రి కళ్యాణ్, సీనియర్ నాయకులు రమణా రెడ్డి, రసింహ యాదవ్, సబ్దార్, లక్కీ అజీజ్, గజ్జల నర్సారెడ్డి, ఉదయ్ విక్రమ్, హరినాథ్ యాదవ్, పాల్గొన్నారు.

మాక్ పాలిసెట్ పరీక్షకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్



పరీక్ష పత్రం విడుదల చేస్తున్న కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ

ఈ నెల 30న నిర్వహించే పాలిసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థినుల కోసం శనివారం కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన మాక్ పాలి సెట్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఉదయం నిర్వహించిన ఈ పరీక్షకు విద్యార్థినులు పరీక్ష రాశారు. మాక్ పాలి సెట్ పరీక్ష పత్రాన్ని కరస్పాండెంట్ రాజేశ్వరి విడుదల చేశారు. ఈ పరీక్ష నిర్వహించడం పట్ల కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి అభినందించారు. పరీక్షలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమ అధికారిగా హిదాయతుల్లా



ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప ఉమ్మడి జిల్లాల మైనారిటీ సంక్షేమ అధికారిగా షేక్ హిదాయతుల్లా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాల మైనారిటీ సంక్షేమ అధికారిగా నియమితులైన ఆయన శనివారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు, యువత, విద్యార్థులు, వ్యాపారులు వంటి అన్ని మైనారిటీ వర్గాల అభివృద్ధికి "ప్రభుత్వం చేపడుతున్న మైనారిటీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రతి అర్హులైన వ్యక్తికి చేరేలా పని చేస్తానని తెలిపారు

కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్. మాధవితో కలిసి "ఈ-చెక్" (ఎలెక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ) కార్యక్రమాన్ని కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. జెసి అదితిసింగ్, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 7 రోడ్స్ నుంచి స్వచ్ఛత ర్యాలీని కలెక్టర్, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను సేకరించే కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆ మేరకు స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేద్దామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రా దివస్‌గా... నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిం చిందని చెప్పారు. కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిపిఒ రాజ్యలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య, ప్రజారోగ్య శాఖల అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

ఆందోళనకరం

ప్రజాదృష్టి

జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు ఆందోళన కలిగించాయి. గంజాయి కేసుల్లో అరెస్టైన సోను అలియాస్ పాండు అనే యువకుడు కస్టోడియల్ హింస కారణంగానే మృతి చెందాడా, లేక ఆత్మహత్య చేసుకున్నాడనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. ఎర్రగుంట్ల ఫ్లైయాస్ సిమెంట్ వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం, మరోవైపు ప్రొద్దుటూరు కేంద్రంగా పలువురు క్రికెట్ బెట్టింగ్ పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. గంజాయి కేసులో పోలీసుల అదుపులో చిక్కిన యువకుడు మృతి చెందడం అనుమానాలకు తావిస్తోంది. మృతుని తల్లి, సోదరి మృతుని శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, కడుపు నొప్పితోనే మరణించాడని అంగీకరించడంతో పరిస్థితి కాస్త చల్లబడింది. తల్లి ఛాను అంగీకరించడం వెనుక ఏమైనా ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయోమో పరిశీలించాల్సి ఉంది. ఎస్‌పి అశోక్‌కుమార్ ఎవరు డిమాండ్ చేయక మునుపే యువకుని మృతి ఘటనపై సిసి ఫుటేజీ ఆధారంగా పరిశీలన చేసి కస్టోడియల్ కేసుగా నమోదు చేయించి, డివిజనల్ స్థాయి పోలీస్ అధికారితో విచారణకు ఆదేశించడం హర్షణీయం. సహచర పోలీసులపై డివిజన్ స్థాయి పోలీస్ ఉన్నతాధికారే విచారణ చేయడంపై సందేహాలు ఉన్నప్పటికీ ఎస్పీ నిర్ణయంలో చిత్తశుద్ధి ద్యోదకమవడంతో ఎటువంటి సందేహాలకు తావు లేకుండా పోయింది. కస్టోడియల్ హింసతో మృతి చెంది ఉంటే ఫోరెన్సిక్ వైద్య నిపుణులు అందించే పోస్టుమార్టం నివేదికలో వాస్తవాలు తేలిపోయే అవకాశం ఉంటుంది. ప్రొద్దుటూరు పట్టణ కేంద్రంగా ఐపిఎల్, మహిళా క్రికెట్ పోటీల నేపథ్యంలో యథేచ్ఛగా బెట్టింగ్ సాగిపోతోంది. ప్రొద్దుటూరు పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. బెట్టింగ్ రాయుళ్లు ఎటువంటి యాప్‌లు ఉపయోగిస్తున్నారు, ఎంతెంత మొత్తంలో పందేలు కాస్తున్నారు. బెట్టింగ్ నిర్వహణకు దారి తీస్తున్న కారణాలేమిటి అనే అంశాలపై లోతుగా విచారణ చేయించాలి. ప్రభుత్వం సోషల్ మీడియాలోని పొలిటికల్ పోస్టులపై పెద్దఎత్తున కేసులు నమోదు, విచారణలు చేస్తున్న నేపథ్యం తెలిసిందే. జిల్లాలో ఏఏ ప్రాంతాల్లో బెట్టింగులు జరుగుతున్నాయి. బెట్టింగ్ రాయుళ్లు ఉపయోగించే యాప్‌ల వివరాలు, ఇతర సాంకేతిక పద్ధతులు ఉమైనా ఉన్నాయా అనే అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తే యువతను సరైన దారిలో పెట్టే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు. ప్రభుత్వానికి ప్రత్యర్థులను ఇబ్బందులు పెట్టడంపై ఉన్న శ్రద్ధ సమాజ పురోగతిపై ఉంటే ఎంతో ప్రయోజనం ఉంటుందని చెప్పవచ్చు. జిల్లాలోని ఎర్రగుంట్ల కేంద్రంగా సాగుతున్న ఎన్‌పిపి ఫ్లయాష్ వ్యవహారం సీరియల్‌ను తలపిస్తోంది. మొన్నటి వరకు అనంతపురం జిల్లా తాడిపత్రి నేతలు, తాజాగా జిల్లాకు వైసిపి నేతల కాంట్రాక్టు వ్యవహారాలు వివాదాస్పదంగా మారడం గమనార్హం.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


మట్టి నమూనాల సేకరణను పరిశీలిస్తున్న ఎడిఎ, ఎఒ

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు (మట్టి నమూనాలు) తప్పనిసరిగా చేయించుకోవాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య, మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. శెట్టివారిపల్లె గ్రామంలో మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని శనివారం ఎడిఎ, ఎఒ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. 2025-26 సీజన్‌కు సంబంధించి మండల వ్యాప్తంగా 690 మట్టి నమూనాలు సేకరించాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామాల్లోని ఒక్కో రైతు సేవా కేంద్రం నుంచి 69 చొప్పున మట్టి నమూనాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశించారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల పొలాల్లో పోషకాల పరిమాణం, ఉదజని సూచిక, లవణ సాంద్రత, సేంద్రియ, కార్బనం వంటి పోషకాలు ఎంత పరిమాణంలో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. ఆ మేరకే ఎరువులను వాడుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

- డిపిఎం ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడి పొందవచ్చని డిపిఎం ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో వ్యవసాయ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వరరెడ్డి హాజరై ప్రకృతి వ్యవసాయం మండలంలో బాగుందన్నారు. ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తాం అని తెలిపారు.. డిపిఎం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో పిఎండిఎస్ విత్తన గుళికలు క్యాంపింగ్ చేసి గ్రామస్థాయిలో డిఆర్‌డిఎ, ఆర్ఎస్‌కె సిబ్బంది సహకారంతో ప్రణాళిక పూర్తి చెయ్యాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపిఎం ఎస్టీలు రాణి, ఎంటీ ప్రతాప్, వ్యవసాయ అధికారి నవంత బాబు వివోఏలు, విఏఏలు, విహెచ్ఎలు, సిసిలు, ఐసిఆర్‌పిలు, యూనిట్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

12 ఏళ్ల తర్వాత చెన్నారెడ్డిపల్లెలో దేవర

- రూ.2 లక్షలు విరాళం అందజేసిన మధుసూదనరెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలోని చెన్నారెడ్డిపల్లెలో 12 ఏళ్ల తర్వాత ఆదివారం గ్రామ ప్రజలు దేవర నిర్వహిస్తున్నారు. అందుకు మండల నాయకుడు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి రూ.2 లక్షలు నగదు వితరణ చేశారు. ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీకాంతమ్మ చేతుల మీదుగా గ్రామ పెద్దలకు నగదు అందజేశారు. దాత డాక్టర్ మధుసూదనరెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. దేవరను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. రాజుల గురువాయిపల్లి గ్రామ శివాలయంలో గర్భగుడి, వరండాలో చప్పట ఏర్పాటు చేసేందుకు గ్రానైట్ బండలు వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజుల సురేంద్రనాథ్ రెడ్డి, పెద్దయ్య, జయరాముడు, వెంకటాద్రి, బడుగు రమణ, కృష్ణయ్య, ఓబయ్య, సుబ్బరాయుడు, పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ గ్రామోత్సవం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక అగ్రహారంలో నూతనంగా అంకాలమ్మ నాభిశిల, పోతు రాజు, శిఖర కలశ నూతన విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రాతః కాలపూజ, గణపతి రుద్ర స్వాహాకార, ఆదిత్యాది నవగ్రహ, చండీహెూమం, రుద్రాభిషేకం, మంగళహారతి నిర్వహించారు. మధ్యాహ్నం విగ్రహమూర్తుల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, దీక్షహెూమం, శాంతి పౌష్టిక హెూమం, మంగళ హారతి తదితర పూజ కార్యక్రమాలు బ్రహ్మశ్రీ శివశంకర శర్మ, బ్రహ్మశ్రీ లోకేష్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. దాత గుండ్ల కుంట శ్రీరాములు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రన్‌ఫర్ జీసస్ ర్యాలీ

ప్రజాశక్తి - ముద్దనూరు

పట్టణంలోని సిఎస్ఐ(ఎస్పిజి), సిఎస్ఐ, మన్నా, హెబ్రోన్ చర్చిల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం క్రైస్తవులు రన్‌ఫర్ జీసస్(ఏసు క్రీస్తు కొరకు పరుగు) ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు రన్‌ఫర్ జీసస్ నినాదాలతో క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. రెవరెండ్ సంతోష్ ప్రసన్న రావ్, రెవరెండ్ డ్యానియేల్ వినయ్‌కుమార్, పాస్టర్ ప్రభాకర్, బ్రదర్ స్వామిదాస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు, మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి అందని జీతాలు

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వ అసమర్థత పాలనతో గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేదని వైసిపి మండల అధ్యక్షులు చంద్రఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షులు మునీర్, రవిశంకర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైసిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 5 నెలలుగా పారిశుధ్య కార్మికులకు కూటమి ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో డ్రయినేజీ, పారిశుధ్య వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని తెలిపారు. ఇఒ వెంకటసుబ్బారెడ్డి, ఇద్దరు సిబ్బందిని రెండు నెలల క్రితం సస్పెండ్ చేశారన్నారు. అప్పటినుండి గ్రామ సచివాలయ ఉద్యోగులకు, పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేదన్నారు. మేజర్ పంచాయతీ అయిన వేంపల్లెలో కూటమి నాయకులు ఆధిపత్యంతో ఇప్పటివరకు ఇఒను నియమించకుండా గ్రామపంచాయతీని భ్రష్టు పట్టించారని తెలిపారు. ఇంత జరుగుతున్నా ఇన్‌ఛార్జిగా ఉన్న డిఎల్‌పిఒ రమాదేవి, ఉన్నతాధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. తక్షణమే అధికారులు స్పందించి కొత్త ఇఒను నియమించి, పారిశుధ్య కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా : 'పోరెడ్డి'

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే ఒక మందిరం శ్రీసరస్వతీ విద్యా మందిరం అని మాజీ జెడ్పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీ సరస్వతీ విద్యా మందిరంలో ప్రార్థనా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య, ఉత్తమ పౌరుడిగా (విద్యార్థిని) తీర్చిదిద్దే ఒక మందిరం శ్రీ సరస్వతీ విద్యా మందిరం పాఠశాల అని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.

పాలిసెట్ నమూనా పరీక్షలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని రవణప్ప సత్రం పాఠశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో మాక్ పాలిసెట్ (నమూనా పరీక్షలు) ప్రారంభించారు. ఈ నెల 25న ఎపిఆర్‌జెసి, 30న పాలిసెట్ నిర్వహించనున్నారు. వాటిలో ప్రవేశాలకు ప్రణాళిక ప్రకారం ఉచిత కోచింగ్‌లో శనివారం మాక్ పాలిసెట్ పరీక్షలు మొదలు పెట్టారు. ఈ పరీక్షలకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుండి 170 మంది విద్యార్థులు హాజరయ్యారు. సీనియర్ విశ్రాంత అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులు.. సమస్యలకు నిలయాలు


స్థానికంగా ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేయని గాలి మిషన్

ప్రజాశక్తి - ఖాజీపేట

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు(ఇంధన విక్రయ కేంద్రాలు)సమస్యలకు నిలయాలుగా మారాయి. పెట్రోల్ బంకుల్లో కనీస సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి పెట్రోల్ బంకులో మరుగుదొడ్లు, గాలి మిషన్, ప్రథమ చికిత్స పెట్టే, విశ్రాంతి గదులు, తాగునీరు తదితర సదుపాయాలు ఉండాలి. ఇవేవీ ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. కొన్ని పెట్రోల్ బంకులలో గాలి మిషన్ యంత్రాలు పనిచేయక నిరుపయోగంగా ఉన్నాయి. వాహనదారులు గాలి పట్టుకోవాలంటే యంత్రం పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పెట్రోల్ బంకులపై పర్యవేక్షణ చేయాల్సిన ఇంధన శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ, అమ్మకపు శాఖ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. మరుగుదొడ్లు మహిళలకు, పురుషులకు వేర్వేరుగా ఉండాలి. కొన్నిచోట్ల ఒక్కటే ఉంటోంది. వాహనదారులకు చల్లటి శీతల యంత్రంతో శుద్ధి నీటిని అందించాల్సి ఉండగా కుళాయి నీటిని మాత్రమే పెడుతున్నారు. కొన్ని పెట్రోల్ బంకులలో మరుగుదొడ్లకు నీటి సదుపాయం లేదు. మరి కొన్ని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా దుర్వాసనతో ఉంటున్నాయని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. పెట్రోల్ బంకు నిర్వాహకులు గాని, అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వాహనదారుల ఆవేదన వ్యకం చేస్తున్నారు. మరికొన్ని పెట్రోల్ బంకులలో సీసీ కెమెరాలు కూడా అరకొరగా పనిచేస్తున్నాయి. వాహనాల భద్రత, రక్షణ ప్రశ్నార్థకంగా ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. స్థానికంగా ఉన్న రెవెన్యూ శాఖ అధికారులు కూడా పెట్రోల్ బంక్‌లపై ఏమాత్రం పర్యవేక్షణ చేయడం లేదనే ఆరోపణలున్నాయి. యజమానులు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకపోయినా వారిపై చర్యలు తీసుకోలేకపోతున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెట్రోలు బంకులలో వాహనదారులకు కనీస సదుపాయాలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'వక్ఫ్' సవరణ రాజ్యాంగంపై దాడి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ఆమోదించడం అంటే ముస్లింలపై జరుగుతున్న దాడి కాదని, ఇది భారత రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించాలని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్ రాష్ట్ర ప్రతినిధి అబ్దుల్ సుభాన్ అన్నారు. చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ముస్లింలు శనివారం ప్రొద్దుటూరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నల్ల జెండాలు, ప్ల కార్డులు చేబూని చట్ట సవరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లింల హక్కులను కాలరాస్తున్న వక్ఫ్ సవరణ చట్టం రద్దయ్యే వరకు పోరాడుతామన్నారు. భారీ ర్యాలీని ఉద్దేశించి శుభహాన్ మాట్లాడారు. మతసామరస్య పరిరక్షణకు చేస్తున్న పోరాటంగా ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అడుగుతున్నట్లు వందల ఏళ్ల నాటి శ్మశానాలకు రికార్డులు దొరుకుతాయా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. వక్ఫ్ కింద ఎనిమిది లక్షల ఎకరాలు ఉన్నాయని అంటున్నారని, మరి ఆలయాల పరిధిలో ఉన్న భూములను ఎందుకు అడగడం లేదన్నారు. నేడు ముస్లింల భూములపై దాడి జరుగుతుందని, రేపు క్రిస్టియన్ల భూములపై, ఎల్లుండి బుద్ధుల భూములపై దాడి జరుగుతుందన్నారు. అటవీ చట్ట ప్రకారం 33శాతం అడవులు ఉంటే మనం బతకగలమన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల 12 శాతానికి అడవులు పడిపోయాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం తీసుకొచ్చిన బిల్లును సమర్థించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యాలయాల భూములను కూడా కాజేసేందుకు కాచుకుని ఉందని, చివరకు వ్యవసాయ భూములను కూడా హస్తగతం చేసుకోవాలని చూస్తే పంజాబ్, హర్యానా రైతులు 1000 మంది రోడ్లపై వచ్చి పోరాడిన సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ భూములను అదాని, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తుందని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ సవరణను రద్దు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని శుభహాన్ హెచ్చరించారు. ముస్లిం జెఎసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ముస్లింలు, మహిళలు పాల్గొన్నారు.


నిరసన ప్రదర్శనలో ముస్లింలు

ఇ-వేస్ట్ పరికరాలపై అవగాహన


అల్లాడుపల్లె ర్యాలీలో నాయకులు, అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ వేస్ట్ మెటీరియల్‌పై అవగాహన కల్పించారు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, ఇతర పరికరాలు వినియోగించి అవి చెడిపోయిన తర్వాత ఇష్టానుసారం పడవేయొద్దన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు వాటిని అందజేస్తే వాటిని రీసైక్లింగ్ చేసి, గ్రామ పంచాయతీకి నిధులు సమ కూరేలా చూస్తామన్నారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అల్లాడుపల్లెలో టిడిపి నాయకులు, అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, పంచాయతీ కార్యదర్శి సుబ్బరామాంజనమ్మ, స్వచ్ఛ్ ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. పారిశుధ్యానికి ప్రజలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. చియ్యపాడులో సర్పంచ్ శివప్రసాద్ పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముద్దనూరు : పరిసరాల శుభ్రతతో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర సాధ్యమని సర్పంచ్ బోనం సరళ, డిప్యూటీ ఎంపిడిఒ వీర భద్రుడు తెలిపారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని సచివాలయంలో శనివారం సర్పంచ్ బోనం సరళ ఆధ్వర్యంలో వీరభద్రుడు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంపై డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ, పంచాయతీ సిబ్బంది, ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసింహులు, వెలుగు సిసి ఇబ్రహీం పాల్గొన్నారు. ఉప్పలూరు గ్రామంలో సర్పంచ్ పల్లా గంగయ్య, ఆధ్వర్యంలో ఎంపిడిఒ ముకుందరెడ్డి అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచ్ గోపాలకృష్ణ, ఎంపిటిసి పాలగిరి రేణుక, సచివాలయం కార్యదర్శి విజయ భారతి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు

వికాస్ పాఠశాలలో..

కడప : స్థానిక అక్కాయపల్లిలో ఉన్న వికాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుకు స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ గొపప్పతన్నాన్ని వివరించారు. విద్యార్థుల మనసు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో అలాగే మీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచి ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అందరూ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడప కోర్టు ఆవరణంలో..

హైకోర్టు వారి ఆదేశానుసారంగా కడప కోర్టు ఆవరణంలో ఎల్.వెంకటేశ్వరరావు కడప మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫుల్ అడిషనల్ ఛార్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్ వెంకటేశ్వరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు కోర్టు ఆవరణాన్ని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె.హేమ స్రవంతి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జి. విజయలక్ష్మి, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : పరిశుభ్రత వ్యాధులను దూరం చేస్తుందని వైఎంఆర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నల్లబల్లి హిమబిందు అన్నారు. ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిఒ ఎంవి సుబ్బారెడ్డి, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కమిషనర్ రాముడు అన్నారు. శనివారం పులివెందుల పట్టణంలోని పూల అంగళ్ళ సర్కిల్ వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో వ్యర్థాలను ఏమి చేయాలి, వ్యర్థాలను సరైన రీతిలో పారవేయకపోవడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ముందుగా పూలంగళ్ల సర్కిల్ వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు కోడి రమణ, లక్ష్మీ భార్గవి, తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకటరామిరెడ్డి, నాయకులు, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అక్కడి నుండి ర్యాలీగా పాత బస్టాండ్ వరకు కొనసాగించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ముద్దనూరులో..

గోశాలను నిర్వహించడం అభినందనీయం : కలెక్టర్

ప్రజాశక్తి - దువ్వూరు

తెలుగు గంగ ప్రాజెక్టు వద్ద ఉన్న గోశాలను శనివారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇక్కడ దాదాపున 400 గోవులు ఉన్నాయన్నారు. తానుకూడా రైతు బిడ్డనే అని, మా అమ్మ 35 ఆవులను పెంచుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయి శ్రీ, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజురెడ్డి, మండల అధికారులు, నాయకులు, గోశాల నిర్వాహకులు పాల్గొన్నారు.


గోశాలను సందర్శిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

చలివేంద్రం ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు : స్థానిక రిజిస్టర్ కార్యాలయం వద్ద శనివారం సిపిఎం నాయకులు సత్యనారాయణ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రయిటర్ సూర్యనారాయణ చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. సమాజంలో పదిమందికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని ప్రతి ఒక్కరిని కోరారు. భూమి మీద ఎవరు శాశ్వతం కాదని, మానవుడిగా పుట్టిన మనం సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడాలన్నారు. పల్లెల నుంచి పట్టణానికి పలు పనులపై ప్రజలు వస్తుంటారని, అలాంటి వారికి చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సుబ్రహ్మణ్యం, మహమ్మద్, సురేష్, రాజేంద్ర, బాబు, శీను, రమణ, బాలసుబ్బయ్య, రాఘవ, సాల్మన్ పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారుడికి రేషన్ అందివ్వాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-వేంపల్లె : ప్రతి లబ్ధిదారుడికి డీలర్లు రేషన్ అందివ్వాలని పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలోని చింతలమడుగుపల్లె, కాలేజీ రోడ్డులో ఉన్న రేషన్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలపై ఆరా తీశారు. ఆర్‌డిఒ చిన్నయ్య మాట్లాడుతూ ప్రతి నెల కార్డు దారులకు రేషన్ అందలేదని ఫిర్యాదులు అందితే అలాంటి డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా ఆయా రేషన్ షాపుల పరిధిలో ఉన్న కార్డుదారులకు బియ్యం పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బియ్యం పంపిణీ సమయంలో కార్డుదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-వేంపల్లె : హైస్కూల్ ప్లస్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు ప్రారంభించినట్లు హైస్కూల్ ప్లస్ హెచ్ఎం శ్రీనువాసులు తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయా ప్రాంతాల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇంటి వద్దకు హైస్కూల్ ప్లస్ అధ్యాపకులు వెళ్లి ప్రభుత్వ ఇంటర్ బాలికల కళాశాలలో చేరాలని కోరారు. కళాశాలలో చేరిన విద్యార్థులకు అడ్మిషన్లు కార్డులను హెచ్ఎం శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్ కళాశాలలో బాలికలకు విద్యా పరంగా ఆధునిక సౌక ర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. ఐఎఫ్‌పి ప్యానల్ ద్వారా విద్యా బోధన, ఉచిత స్టడీ మెటీరియల్, ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ పెట్టి మంచి ఫలితాలను సాధిస్తామన్నారు. ఈ ఏడాది కూడా ఇంటర్‌లో అధిక శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాలగా పేరు గాంచిందని వివరించారు. ప్రభుత్వం నుండి ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు ఇస్తారన్నారు.మధ్యాహ్నం భోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పిజిటి అధ్యాపకులు ఆవుల వెంకట్, క్రిష్ణవేణి, పద్మావతి పాల్గొన్నారు.

పిల్లల పోషణ పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి-చక్రాయపేట : గర్భధారణ మొదలు బిడ్డకు రెండేళ్ల వయసు వరకు వెయ్యి రోజుల సమయం అత్యంత ముఖ్యమైందని, తల్లి బిడ్డకు తీసుకునే సంరక్షణ బిడ్డ ఆరోగ్యానికి, భవిష్యత్తుకు పునాది అని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ వి.సునీత పేర్కొన్నారు. సురభిరెడ్డివారి పల్లె అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు కూడా తాము తీసుకునే ఆహారం పట్ల, పిల్లల పోషణ పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు, మంచి వాతావరణం ఉండేలా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయాలన్నారు. సూపర్‌వైజర్ సుభద్ర, అంగన్వాడీ కార్యకర్తలు కౌసల్యమ్మ, వెంకటసుబ్బమ్మ, సహాయకురాలు సిద్ధమ్మ తల్లులు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

ఖాదరపల్లెలో నాకాబందీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదరపల్లిలో శనివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ట్రైనీ డీఎస్పీ భవాని ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలన చేశారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సాధారణ తనిఖీలో భాగంగా ఖాదరపల్లిలో నాకాబందీ నిర్వహించామన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలకు కొంతమంది పాల్పడుతున్నారని సమాచారం వచ్చిందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి క్షుణ్ణంగా సిబ్బంది పరిశీలించారన్నారు. గ్రామంలో అనుమానంగా ఎవరైనా సంచరిస్తే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్న పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. గోపవరం పశువైద్య కళాశాల విద్యార్థులు ఉచిత పశువైద్య శిబిరంలో పాల్గొన్నారు. పశువులకు గర్భకోశ పరీక్షలు, ఇతర సమస్యలకు శస్త్రచికిత్స చేశారు. నట్టల నివారణ మందులను తాపించారు. మినరల్ మిక్సర్, ఎముకుల పొడిని రైతులకు అందజేశారు. రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య కళాశాల అధికారులు ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ ఇందిర, వైద్యులు వాణి, సుమిరన్, భార్గవి, విజయ్‌కుమార్, రాయల్‌రెడ్డి, శ్రీవాణి, పశువైద్య అధికారులు సుదర్శన్ రెడ్డి, సిబ్బంది లక్షినారాయణ, రైతులు పాల్గొన్నారు.

వైసిపి నేతలు ధర్నా చేపట్టడం సిగ్గుచేటు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మేజర్ పంచాయతీలో పాలక మండలి అంతా వైసిపి నేతలే ఉండి కూడా ధర్నా చేపట్టడం సిగ్గు చేటని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దొడ్డి దారిన వచ్చి మేజర్ పంచాయతీలో వైసిపి నేతలు పాలక మండలి సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వైసిపి పాలనలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి పంచాయతీ ఆకౌంట్‌లో ఉన్న డబ్బులను చెక్ రూపంలో ఇవ్వకుండా నగదు రూపంలో ఇవ్వడం వల్ల ఇటీవల సస్పెన్షన్ అయ్యాడని తెలిపారు. వైసిపి నిర్వాహకంతోనే అన్యాయంగా ఇఒ సస్పెండ్ అయ్యాడని చెప్పారు. సర్పంచ్‌కు చెక్ పవర్ కూడా రద్దయిందన్నారు. కూటమి నాయకులపై ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని రామమునిరెడ్డి ప్రశ్నించారు. మంచి ఇఒను ఇక్కడికి బదిలీ చేస్తే ఆయనను ఫోన్ చేసి బెదరించిన ఘనత వైసిపి నేతలదే అన్నారు. వేంపల్లెకు మంచి పంచాయతీ కార్యదర్శిని నియమకం చేపట్టాలని కలెక్టర్‌ను కోరామన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నేతలు మహమ్మద్, వేమ కుమార్, డక్కా రమేష్, శివ, యడాల జగదీష్ పాల్గొన్నారు.

10న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మే 10న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టులో కోర్టు పరిధిలోని పోలీస్ డిపార్ట్మెంట్, బార్ కౌన్సిల్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అనేక రకాల కేసులను రాజీ మార్గాన పరిష్కరించేందుకు ఇది ఒక చక్కటి మార్గమన్నారు. కోర్టు పరిధిలో ఉన్న డిఎస్పి, సిఐలు, ఎస్ఐలు, న్యాయవాదులు అందరూ కలిసి సంబంధిత కక్షిదారులతో మాట్లాడి కేసులను పరిష్కరించుకునేలా చేయాలన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ లక్షుమయ్య, సిఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు, బార్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మహిళలు ఆర్థికంగా ఎదగాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్దేశ్యమని టిడిపి కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వెనుక బడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో స్థానిక ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని స్త్రీ శక్తిభవన్‌లో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని కొండారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఉపాధికి మంచి అవకాశం అన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విఎస్ ముక్తియార్, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసులరెడ్డి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పోసా వరలక్ష్మి, గాజుల శివజ్యోతి, వంగనూరు మురళీధర్‌రెడ్డి, కమాల్ బాషా, మాజీ కౌన్సిలర్లు వద్ది బాలుడు, తలారి పుల్లయ్య, టిఎన్టియుసి జిల్లా అధ్యక్షులు చింతకుంట కుతుబుద్దీన్, పోసా భాస్కర్, ప్రతాప్, మహిళలు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ని భర్తరఫ్ చేయాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ కార్యాలయంలోని ఎఒ నిజాముద్దీన్‌కు వినతిపత్రమిచ్చారు. తక్షణమే అధికారులు ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్ పాల్గొన్నారు.